# ట్రాఫిక్‌కు టాటా.. హైవేపై హాయిగా

- కొత్త బైపాస్‌పై దూసుకుపోతున్న వాహనాలు
- అంగళ్లులో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం


అంగళ్లు కొత్త బైపాస్‌పై దూసుకుపోతున్న వాహనాలు

**కురబలకోట :** కొత్త బైపాస్‌తో మండల కూడలి అంగళ్లుకు శాశ్వతంగా ట్రాఫిక్ సమస్య దూరమైంది. చిరకాల సమస్య తీరడంతో అంతటా హర్షం వ్యక్తమవుతోంది. ములకలచెరువు నుంచి అంగళ్లు మీదుగా మదనపల్లె మండలం తట్టివారిపల్లె సర్కిల్ వరకు హైవే (ఎన్‌హెచ్–42) పనులు పూర్తయ్యాయి. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చొరవతో ఈ రోడ్డుకు రూ. 332.11 కోట్ల కేంద్ర నిధులు మంజూరయ్యాయి. గత ఏడాది జనవరి 26న ఈ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ ఏడాది అక్టోబరు 24న ఈ రోడ్డు పనులు పూర్తయ్యాయి. కేసీవీఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పీఎల్ఆర్ కంపెనీ సంయుక్తంగా ఈ రోడ్డు పనులు చేపట్టినట్లు హైవే అధికారులు తెలిపారు. ఇటీవల ట్రయల్ రన్ నిర్వహించారు. దీంతో వాహనాలు హైస్పీడుతో దూసుకుపోతున్నాయి. అంగళ్లు దగ్గరున్న దొమ్మన్న బావి నుంచి మదనపల్లె వరకు ఫోర్‌వే రోడ్డు వేశారు. ఈ బైపాస్ రోడ్డుపై జోరుగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. 50 ఏళ్లుగా అంగళ్లులో ట్రాఫిక్ సమస్య ఉండేది. చిన్నపాటి సంఘటనలు, ధర్నాలు, ఆందోళనలతో పాటు ట్రాఫిక్ జామ్ అయితే నాలుగు రోడ్లు పొడవునా వాహనాలు బారులు తీరి నిలచిపోయేవి. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడేవారు. వీటన్నింటికి కొత్త బైపాస్ చెక్ పెడుతోంది. దీంతో సమయం ఆదా కావడంతో పాటు ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం లభించినట్లైంది. కదిరి, కడప, మదనపల్లె, సీటీఎం మార్గాల నుండి వచ్చే వాహనాలు అంగళ్లు బైపాస్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. వివిధ కళాశాలల బస్సులు కూడా ఒకేసారి బయలు దేరుతుండడంతో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం అంగళ్లులో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యేది. కొత్త బైపాస్‌తో ఈ సమస్యలకు చెక్ పడింది. అంతేగాకుండా ఇక మీదట అంగళ్లులో ధర్నా, రాస్తారోకో, ఆందోళనలు, సభలు, సమావేశాలు లాంటివి సాగించినా కొత్త బైపాస్‌తో ట్రాఫిక్ సమస్య తలెత్తదు. ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా సాగిపోతాయి.

**తీరిన ట్రాఫిక్ సమస్య**

అంగళ్లు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. పోలీసులు, గ్రామస్తులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు కొత్త బైపాస్‌తో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూములకు, పల్లెలకు కూడా విలువ పెరిగింది. వివిధ ప్రయాణ సౌకర్యాలు మరింత అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడి పల్లెలు పట్టణ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి వాహనదారులు, ఈ ప్రాంతవాసులు కృతజ్ఞతలు చెబుతున్నారు. త్వరలో అధికారికంగా ప్రారంభించనున్నట్లు హైవే అధికారులు తెలిపారు.

## ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి


బహుమతులు అందజేస్తున్న ఆర్ఆర్ఎస్ సిబ్బంది


పీలేరులో ఎయిడ్స్ డే ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**మదనపల్లె సిటీ :** ఎయిడ్స్/హెచ్ఐవీ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి అన్నారు. శనివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని రెడ్‌రిబ్బన్, ఆర్ఆర్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కూడా ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవీ లక్షణాలు ఉన్నట్లయితే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేసుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే వైద్యుని సలహా మేరకు మందులు వాడాలన్నారు. కాలేజీలో నిర్వహించిన డ్రాయింగ్, రంగోలి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ కో ఆర్డినేటర్ మోహన్‌వల్లి, అధ్యాపకులు జ్యోతి, ఆర్ఆర్ఎస్ మేనేజర్ పురుషోత్తం, సిబ్బంది శ్వేత, పల్లవి తదితరులు పాల్గొన్నారు. బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కాలేజీలో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రెడ్డప్పరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

**ఎయిడ్స్ నిర్మూలన సామాజిక అవసరం**

**పీలేరు రూరల్ :** ఎయిడ్స్ నిర్మూలన సామాజిక అవసరమని ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ డే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడు ఎన్నో వ్యాధులను జయించినప్పటికీ ఎయిడ్స్‌పై విజయం సాధించలేకపోయాడని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులు అత్యధికంగా ఉన్న రాష్ట్రాల సరసన ఆంధ్రప్రదేశ్ కూడా ఉండడం బాధాకరమన్నారు. సీహెచ్‌వో అమ్మాజీ మాట్లాడుతూ ఎయిడ్స్ సంక్రమణ విధానాలు, నివారణ పద్ధతులు, చికిత్స విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ సమన్వయకర్త జి. రాధాకృష్ణ, ఎన్ఎస్ఎస్ అధికారి యల్లయ్య, సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఎయిడ్స్‌పై అవగాహన అవసరం**

**తంబళ్లపల్లె :** ఎయిడ్స్‌పై అందరికి అవగాహన అవసరమని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్వి తెలిపారు. శనివారం ముందస్తు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్, ఆస్పత్రి సిబ్బంది ప్ల కార్డులు చేతపట్టి నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వల్ల కలిగే అనర్థాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఐసీటీఐ కౌన్సిలర్ చంద్రమోహన్, ఎల్‌టీ బాలాజీ, అధ్యాపకులు పాల్గొన్నారు.


## శివశంకర్‌ను ‘వరి’ంచింది

- సన్న గింజ వరికి చెందిన ఆర్ఎన్ఆర్ రకం సాగు
- మోటార్ మెకానిక్ అ‘ధన’పు రాబడి


ఎర్రబల్లి వద్ద శివశంకర్‌రెడ్డి సాగు చేసిన వరిపంట

**కురబలకోట :** మండలంలోని అంగళ్లుకు చెందిన శివశంకర్ రెడ్డి వరి సాగు చేసి అదనపు రాబడి సాధించారు. ఇతను వృత్తి పరంగా మోటార్ మెకానిక్. ప్రవృత్తిగా వ్యవసాయంలో కూడా రాణిస్తున్నారు. టమాటా సాగులో కూడా సక్సెస్ అయ్యారు. ఆదర్శ రైతుగా కూడా పేరు తెచ్చుకున్నాడు. మండలంలోని ఎర్రబల్లి వద్ద సన్న గింజ వరికి చెందిన ఆర్ఎన్ఆర్ రకం సాగు చేశాడు. ఇది కాస్తా విరగపండింది. దీంతో రైతులను ఈ సాగు అమితంగా ఆకట్టుకుంటోంది. పంట దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. కుంటకు 40 బస్తాల చొప్పున మూడు ఎకరాలకు 120 బస్తాల వడ్లు దిగుబడి రాగలదని స్వానుభవంతో చెబుతున్నాడు. తెలంగాణలోని రాజేంద్ర నగర్ జయశంకర్ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు ఈ విత్తనాలను రూపొందించారు. ఆశాజనకంగా పంట రావడంతో ఈ రకం పట్ల రైతాంగం కూడా మక్కువ చూపుతున్నారు. 75 కిలోల వడ్లు బస్తా రేటు ప్రస్తుతం రూ.2 వేలు దాకా ఉంది. వెన్ను బాగా పడుతుంది. 125 రోజుల్లో పండుతుందని వ్యవసాయాధికారి రాధ తెలిపారు.


**ఊహించ లేదు**



ఇదివరలో టమాటా సాగు చేశా. దాదంవారిపల్లెకు చెందిన రైతు ఒకరు నాటడానికి నీళ్లు లేని కారణంగా నారు ఇచ్చారు. దీన్ని మూడు ఎకరాల్లో సాగు చేశా. ఇది ఆర్ఎన్ఆర్ వరి రకం. యూరియా, డీఏపీ ఒకసారి వేశా. ఎలాంటి పిచికారి మందులు కొట్టలేదు. మంచి దిగుబడి వచ్చింది. తెగుళ్లను, వాన గాలిని తట్టుకుంటుంది. వరి పంట ఇంత బాగా పండుతుందని ఊహించలేదు. – పి. శివశంకర్ రెడ్డి, అంగళ్లు, కురబలకోట మండలం

## చూడచక్కని బడి


బద్దిపల్లె ప్రాథమిక పాఠశాల


పాఠశాలను అభివృద్ధి చేసిన సద్దికూటి కుటుంబం

**కురబలకోట:** ఎవరు ఔనన్నా..కాదన్నా ఇప్పుడు మండలంలో అందరి చూపు ముదివేడు (కడప) క్రాస్ సమీపంలోని బద్దిపల్లె ప్రభుత్వ ప్రాథమిక స్కూల్‌పై పడింది. కార్పొరేట్ స్కూల్‌ను తలపించేలా ఉండడమే ఇందుకు కారణం. సాధారణంగా స్కూల్ లోపల తరగతి గదుల్లో గ్రానైట్ ఉంటుంది.. కానీ ఇక్కడ బయట పార్కింగ్ స్థలంలో కూడా గ్రానైట్ పరచి ఉండడం స్పెషల్. చూడ్డానికి చిన్న స్కూలే అయినా రూపురేఖలు మార్చుకుంటూ పిల్లల ఎదుగుదలకు కృషి చేస్తున్నారు అక్కడి టీచర్లు. ఇందుకు ఆస్కూల్ కమిటీ చైర్మన్ సద్దికూటి హరినాథ్, ఇతని తండ్రి సద్దికూటి శ్రీనివాసులు, సోదరుడు సద్దికూటి దామోదర్ తమ వంతుగా ఆర్థికంగా సహరించారు. స్కూల్ కమిటీ చైర్మన్ సద్దికూటి హరినాథ్ ఆర్థికంగా స్థితిమంతుడైనా తన ఇద్దరి పిల్లలు దేవిశ్రీ, మహర్షిని ఇదే స్కూల్‌లో చదివిస్తుండడం మరో విశేషం. పిల్లలను స్కూల్‌లో వదలడానికి వచ్చినప్పుడు స్కూల్ స్థితిగతులను, పరిసరాలను గమనించిన అతను రూపురేఖలు మార్చాలని సంకల్పించాడు. తరగతి గదుల్లోను, వరండాలోను ఆపై స్కూల్ బయట పార్కింగ్ స్థలంలో కూడా పిల్లలు ఆడుకోడానికి వీలుగా గ్రానైట్ టైల్స్ వేయించారు. కరెంటుతో పాటు స్కూల్‌కు పెయింటింగ్ వేయించి అందంగా మార్చారు. విద్యార్థుల తాగునీటి కోసం పైపులైన్ కూడా వేయించారు. వీటన్నింటికి రూ.5 లక్షల దాకా ఖర్చు చేశారు. ఈ క్రమంలో నేను సైతం అంటూ అక్కడి హెడ్మాస్టర్ రామిశెట్టి గీతాంజలి కూడా రూ.18 వేలు సొంత నిధులతో కంప్యూటర్ ఏర్పాటు చేయించారు. దీని ద్వారా కృత్యాధార బోధన ప్రాథమిక స్థాయి నుండే అందిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నారు. ఇక్కడ 30 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రాయితీ ఇస్తామని ప్రైవేటు స్కూల్‌కు రావాలని గత నాలుగేళ్లుగా కోరుతున్నా కొందరు కోరుతున్నా ఒక్కరు కూడా ఆ వైపు మొగ్గు చూపలేదు. దీన్ని బట్టి ఈ స్కూల్ ప్రత్యేకత గురించి అర్థం చేసుకోవచ్చు. దీంతో ఈ స్కూల్ హెడ్మాస్టర్ ఆర్.గీతాంజలి, టీచర్ బీవీ రమణను ఉన్నతాధికారులతో పాటు మండల విద్యాశాఖాధికారి ద్వారకనాథ్ మెచ్చుకుంటున్నారు. బెస్ట్ టీచర్లుగా కూడా వీరు సత్కారం పొందారు. ఇది మండలంలోనే మోడల్ స్కూల్‌గా గుర్తింపు పొందింది. పలువురు మెచ్చుకుంటున్నారు.

### హామీల అమలులో
## కూటమి ప్రభుత్వం విఫలం

**మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి**


దిగువబూడిదవేడులో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

**కలికిరి (వాల్మీకిపురం) :** కూటమి ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని దిగువబూడిదవేడులో స్థానిక నాయకులు, కార్యకర్తలను శనివారం ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి పూర్వవైభవం తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అధికారం చేపట్టిన ఆరు నెలల వ్యవధిలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజలలో పూర్తి వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. సూపర్‌సిక్స్ హామీలతో గద్దెనెక్కి హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసగించడం దారుణమన్నారు. ఇటువంటి తరుణంలో ప్రభుత్వ అరాచకాలు, అక్రమాలు, మోసాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అంతకు మునుపు ఇదే గ్రామానికి చెందిన విశ్రాంత పోస్ట్ మాస్టర్ నల్లవేములరెడ్డిగారి రెడ్డెప్పరెడ్డి హఠాన్మరణం చెందిన సమాచారం తెలుసుకుని ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమాలలో వాల్మీకిపురం, కలికిరి మండలాల పార్టీ కన్వీనర్‌లు నీళ్ళ భాస్కర్, రమేష్‌కుమార్ రెడ్డి, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువజనోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

**మదనపల్లె సిటీ :** జిల్లా యువజనోత్సవాల్లో జరిగిన పోటీల్లో మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. వ్యక్తృత్వ పోటీల్లో అమీనా ద్వితీయ బహుమతితో పాటు రూ.2500 నగదు గెలుచుకుంది. పెయింటింగ్ పోటీల్లో చందన కన్సొలేషన్ బహుమతి కైవసం చేసుకున్నారు. బహుమతులు గెలుపొందిన విద్యార్థులను శనివారం కాలేజీలో అభినందించారు.కార్యక్రమంలో కల్చరల్ కో ఆర్డినేటర్ హాజిరాఖానమ్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకురాలు మోహన్‌వల్లి, పాల్గొన్నారు.

**యువజనోత్సవాల్లో జ్ఞానాంబిక విద్యార్థుల ప్రతిభ**

**మదనపల్లె :** మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ నెహ్రూ యువకేంద్ర అన్నమయ్య జిల్లా ఆధ్వర్యంలో రాయచోటిలో నిర్వహించిన యువ ఉత్సవ్–2024లో జ్ఞానాంబిక విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. శనివారం కళాశాలలో యువజనోత్సవాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఫోక్ విభాగంలో బంజారా గ్రూప్ డ్యాన్స్‌కు మొదటిబహుమతి రూ.7వేలు, కోయ డ్యాన్స్‌కు రెండో బహుమతి రూ.5వేలు కళాశాల విద్యార్థినులు సాధించారన్నారు. యువజనోత్సవాల్లో తమ విద్యార్థినులు చూపిన ప్రతిభతో సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, డాన్స్‌మాస్టర్ సురేష్ తదితరులు ఉన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరం చేయాలి


మూగవాడిలో సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఏపీఓ

**రామసముద్రం :** మండలంలో మంజూరైన సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరం చేయాలని ఎంపీడీఓ భానుప్రసాద్, ఏపీఓ గౌరీశంకర్ తెలిపారు. శనివారం మూగవాడి గ్రామంలో సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. డిసెంబర్ చివరిలోపు పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే గుండ్లపల్లె, మూగవాడి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. పిల్లల హాజరుపట్టిని, సిబ్బంది హాజరు పట్టిని పరిశీలించారు. సమయపాలన పాటించాలని ఆదేశించారు. పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. అలాగే పెద్దకురప్పల్లెలో వేకువజామునే అవ్వాతాతలకు పెన్షన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రెడ్డిశేఖర్, కాంట్రాక్టర్ శివారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కుల వివక్ష చూపితే చర్యలు


పెద్దతిప్పసముద్రం : కాట్నగల్లులో దళితుల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు


నిమ్మనపల్లె : చలిమామిడిపల్లెలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు


రామసముద్రం : ఆర్.నడింపల్లె ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్న అధికారులు

**పెద్దతిప్పసముద్రం :** సమాజంలో మనుషులంతా ఒక్కటేనని, ఎవరైనా కుల వివక్ష చూపితే చర్యలు తప్పవని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ధనంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని కాట్నగల్లు హరిజనవాడలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అధికారులు దళితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో తాగునీటి సౌకర్యం, మురుగు కాలువల ఏర్పాటు, విద్యుత్ సమస్య అధికంగా ఉందన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. అనంతరం అగ్రిగోల్డ్ భూముల పట్టాలు, సాగు విషయంలో దళితులే ఒకరిపై మరొకరు వాదులాటకు దిగడంతో పోలీసులు కలుగజేసుకుని సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని హితవు పలికారు. డీటీతో పాటు ఆర్ఐ బాలాజీ, వీఆర్వో మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన**

**నిమ్మనపల్లె :** ఎస్సీ, ఎస్టీ ప్రజలకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించేందుకు సివిల్ రైట్స్‌డేను ప్రతినెలా నిర్వహిస్తామని తహసీల్దార్ ధనంజయులు తెలిపారు. శనివారం మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ చలిమామిడిపల్లెలో తహసీల్దార్ ధనంజయులు, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డిలు కలిసి ప్రజలతో సమావేశమై సివిల్ రైట్స్ డే ముఖ్య ఉద్దేశాలను వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ..జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసు మేరకు ప్రతినెలా చివరితేదీన సివిల్‌రైట్స్ డే నిర్వహించి ఎస్సీ, ఎస్టీ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి, వారిపై ప్రజల్లో ఉన్న అసమానతలు, వివక్ష తొలగించేందుకు కృషి చేస్తామన్నారు. చట్టం ముందూ అందరూ సమానమేనన్నారు. ఎస్సీ,ఎస్టీ ప్రజలను ఇబ్బందులకు ఎవరైనా గురిచేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. అనంతరం స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంఈఓ నారాయణ, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, వీఆర్వోలు హేమాంబర్‌రెడ్డి, నాగరాజ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భానులక్ష్మీదేవి, మండలస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్‌డే**

**రామసముద్రం :** రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి తహసీల్దార్ నిర్మలాదేవి, ఎస్ఐ వెంకటసుబ్బయ్య హాజరయ్యారు. ఎస్సీ కాలనీలో అధికంగా రాత్రివేళ మద్యం సేవించి గొడవలు చేస్తున్నారని, అయితే రాత్రివేళ పోలీసులు ఇటువైపు రావడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. అలాగే కాలనీలో పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్వేయర్ నాగరాజ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 96 శాతం పింఛన్లు పంపిణీ

**పీలేరు రూరల్ :** మండలంలో శనివారం 96 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ జి. శివశంకర్ తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డిశెంబర్ 1న ఆదివారం కావడంతో శనివారం ఉదయం నుంచి పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 9748 పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా 9286 మందికి పంపిణీ చేసినట్లు చెప్పారు.

### శ్రీలక్ష్మీనరసింహుడికి విశేష పూజలు


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**గుర్రంకొండ :** మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసంలో చివరి శనివారం రోజున టీటీడీ ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. స్వామివారిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

### లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

**పెద్దతిప్పసముద్రం :** మండలంలోని హౌసింగ్ లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామని హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఏఈ శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం అధికారులు మండలంలోని కందుకూరు, టి.సదుం, మల్లెల, పులికల్లు గ్రామాల్లో పర్యటించారు. లేఅవుట్లలో విద్యుత్, నీటి సౌకర్యం, పైప్‌లైన్, సింటెక్స్ లాంటి సౌకర్యాలను గ్రామ పంచాయతీ నిధులతో పరిష్కారం అయ్యేలా చొరవ చూపుతున్నామని చెప్పారు. అనంతరం ఎంపీడీఓ సచివాలయాలను తనిఖీ చేసి పింఛన్ల పంపిణీ తీరుపై ఆరా తీశారు.

### ఇన్‌చార్జి కార్యదర్శుల నియామకం

**పెద్దతిప్పసముద్రం :** మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులను నియమించామని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ శనివారం తెలిపారు. మండలంలోని టి.సదుం పంచాయతీకి నవీన్ కుమార్, పోతుపేటకు శ్రీనివాసులు, మద్దయ్యగారిపల్లికి రెహన, పట్టెంవాండ్లపల్లికి మంజునాథ్, తుమ్మరకుంటకు శ్వేతలను నియమించామన్నారు. ఇటీవల కార్యదర్శులు బదిలీ కావడంతో మండల ప్రజల సౌకర్యార్థం పక్క పంచాయతీల్లో రెగ్యులర్‌గా ఉన్న కార్యదర్శులకు ఇన్‌చార్జులుగా అదనపు బాధ్యతలు అప్పగించామన్నారు.

### సీఐ రాజారెడ్డి బదిలీ

**బి.కొత్తకోట :** స్థానిక సీఐ కే.రాజారెడ్డి బదిలీ అయ్యారు. ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టి నాలుగు నెలల గడవక ముందే బదిలీ కావడం చర్చనీయాంశమైంది. ఆయన్ను రాయచోటి ఎస్‌బీ–3 సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడికి కొత్త సీఐగా వైఎస్సార్‌జిల్లా పులివెందుల సీఐగా పనిచేస్తున్న జి.జీవన్ గంగనాథ్‌బాబు నియమితులయ్యారు.

### హామీల అమలుకు కట్టుబడిన ప్రభుత్వం

**బి.కొత్తకోట :** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక నందిశెట్టి వీధిలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. కొత్తగా పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కమిషనర్ పల్లవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### వృత్తి నైపుణ్యంపై అవగాహన

**బి.కొత్తకోట :** వృత్తి నైపుణ్యంపై స్థానిక ఆదర్శ విద్యాలయం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వాటర్‌ప్లాంట్ల వద్దకు తీసుకెళ్లి వాటిపై అవగాహన కలిగేలా వివరించారు. విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నరేంద్రనాయక్ మాట్లాడుతూ వృత్తి విద్యలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ధ్రువపత్రాలను అందిస్తున్నట్లు చెప్పారు. వీరికి ఉపాధి అవకాశాలపై అవగాహన ఇస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు సునీత, హనుమంత్‌రెడ్డి, స్వామినాధన్, సుధీర్ కుమార్, కేశవులు పాల్గొన్నారు.

### తెట్టు ఆలయానికి పూజ సామగ్రి అందజేత

**కురబలకోట :** మండలంలోని తెట్టు శ్రీ వేణుగోపాల స్వామి ఆలయానికి చెక్క రఘుపతి, తేజ, ప్రసాద్ దీపాలు, వెండిపళ్లెం, కలశం పాత్రలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### హార్సిలీహిల్స్‌పై గజగజ


హార్సిలీహిల్స్‌పై కురుస్తున్న మంచు

**బి.కొత్తకోట :** మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై శనివారం రాత్రి చలి తీవ్రత పెరిగి సందర్శకులు గజగజ వణికిపోతున్నారు. తుపాను ప్రభావంతో మంచు అధికమైంది. వర్షం కురుస్తుండటం, చలి గాలులు వీస్తున్న కారణంగా చలి పెరిగింది. సందర్శకులు గదులకే పరిమితమయ్యారు. చలి తీవ్రత రాత్రి 12 గంటల నుంచి తెల్లవారు జాము నాలుగు గంటల వరకు తీవ్రమవుతున్నదని స్థానికులు తెలిపారు.

### కార్తిక దీపోత్సవం


షిర్డిసాయిబాబా విగ్రహం ఎదుట దీపాలు వెలిగిస్తున్న మహిళలు

**మదనపల్లె సిటీ :** స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం కార్తిక దీపోత్సవం కనుల పండువగా జరిగింది. మహిళలు దీపాలు వెలిగించారు. ఆలయంలోని షిర్డిసాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు భాస్కర్, బాలకృష్ణ, బండి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### దివాకర్ సేవలు మరువలేనివి


పదవీవిరమణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

**రామసముద్రం :** చెంబకూరు జెడ్పీహైస్కూల్‌లో ఎస్టీటీ తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ పొందిన దివాకర్ సేవలు మరువలేనివని ఎంఈఓలు హేమలత, ఆంజనేయులు తెలిపారు. శనివారం చెంబకూరు శ్రీ వాసవి కల్యాణమండపంలో పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దివాకర్‌ను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులను సక్రమమార్గంలో నడిపేందుకు ఎంతో కృషి చేశారన్నారు. పలువురు వక్తలు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈస్ట్ స్కూల్ హెచ్ఎం హేమలత, హైస్కూల్ హెచ్ఎం విష్ణుప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు చేయూత


విద్యార్థులతో బ్యాంక్ సిబ్బంది, ఉపాధ్యాయులు

**రాయచోటి టౌన్ :** పేద విద్యార్థులకు చేయూతనిస్తున్నట్లు రాయచోటి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ )అసిస్టెంట్ మేనేజర్ పవిత్ర తెలిపారు. శనివారం ఓదివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ప్రతిభ సాధిస్తున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు విద్యాజ్యోతి పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ అసిస్టెంట్ మేనేజర్ యోశిత, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయులు శివారెడ్డి, కృష్ణారెడ్డి, ఈశ్వర్ నాయక్, ఏపీజీబీ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.